

బోనమో పోచమ్మ

గొల్లపల్లి : లొత్తునూర్‌లో మహిళలు ఆదివారం బోనాల ఊరేగింపు నిర్వహించారు. పోచమ్మకు నైవేద్యం సమర్పించుకున్నారు.



పర్యాటక అభివృద్ధికి కృషి

జగిత్యాల: జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని అదనపు కలెక్టర్ మకరంద్ అన్నారు. ఖిలాను ఆదివారం ఆయన సందర్శించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.0/19.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తక్కువగా ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రోడ్ల నిర్మాణాలకు నిధులు

ధర్మపురి: వివిధ గ్రామాల్లో చేపట్టే రహదారుల నిర్మాణాలకు నిధులు మంజూరైనట్లు రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదివారం తెలిపారు. ఆరెపెల్లి – గంగమ్మతల్లి ఆలయం, గోదావరి నది వరకు ఫార్మేషన్ రోడ్డుకు రూ.30 లక్షలు, పీడబ్ల్యూ రోడ్డు – బోదరనక్కల చెరువు గూడెం వరకు రూ.1.60 కోట్లు, పీడబ్ల్యూ రోడ్డు – దోనూర్ రోడ్డు ఎస్సీకాలనీ వరకు రూ.1.10 కోట్లు, రాయపట్నం – పెద్దయ్యగుట్ట వరకు ఫార్మేషన్ రోడ్డు నిర్మాణానికి రూ.30 లక్షలు, ఆర్ అండ్ బీ రోడ్డు, రాజారం – కోస్నూర్‌పల్లె – బోయవాడ వరకు సుమారు రూ.3 కోట్లు మంజూరైనట్లు ఆయన వివరించారు.

ఉద్దేశపూర్వక పోస్టులు వద్దు



ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: సామాజిక మాధ్యమాల్లో ఉద్దేశ పూర్వకంగా పోస్టులు చేసినా, అసభ్య పదజాలంతో దూషించినా, మార్ఫింగ్ ఫొటోలు అప్‌లోడ్ చేసినా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ భాస్కర్ హెచ్చరించారు. తన కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొందరు విదేశాల్లో ఉంటూ సోషల్ మీడియాలో ఏంచేసినా తమకేమీ కాదన్నట్లు ఉద్దేశపూర్వకంగా పోస్టులు చేస్తున్నారని ఆయన అన్నారు. అలాంటి వారిపై కేసులు నమోదు చేసి లుక్ అవుట్ నోటీసు జారీచేస్తామని ఎస్పీ హెచ్చరించారు. వారి పాస్‌పోర్టులు, వీసాలు రద్దు చేసే వీలుందని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నిందితులను గుర్తించి పట్టుకుంటామని పేర్కొన్నారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చూడడం పోలీసుల ప్రధాన లక్ష్యమని ఎస్పీ వివరించారు.

ఇంటింటికీ పోలీస్



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

కోరుట్ల: అసాంఘిక కార్యకలాపాల నివారణకు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం చేపట్టామని డీఎస్పీ రవీందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఉదయం ఆరు గంటలకు స్థానిక అల్లమయ్యగుట్టకాలనీలో కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహించారు. ఇద్దరు సీఐలు, ఆరుగురు ఎస్సైలు, వందమంది పోలీసులతో ఇంటింటా తనిఖీలు చేశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువుల గురించిన సమాచారాన్ని పోలీసుల దృష్టికి తేవాలని కోరారు. డయల్ 100 నంబర్‌కు ఫోన్‌చేస్తే వెంటనే స్పందిస్తామని అన్నారు. గంజాయి, అక్రమ మద్యం, పేకాట విషయాల్లో కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతలు కాపాడటానికి చేపట్టిన కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని కోరారు. ధ్రువీకరణ పత్రాలులేని 8 ఆటోలు, 85 ద్విచక్రవాహనాలు సీజ్ చేశారు. కార్యక్రమంలో కోరుట్ల, మెట్‌పల్లి సీఐలు ప్రవీణ్‌కుమార్, లక్ష్మీనారాయణ, ఎస్సైలు సతీశ్, శ్యాంరాజ్, సుధీర్‌రావు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కోరుట్ల: ఏప్రిల్1న పట్టణంలో నిర్వహించే వీర హనుమాన్ విజయ యాత్ర ప్రచార పోస్టర్లను వీహెచ్‌పీ, ఏబీవీపీ, హిందూ వాహిని, హనుమాన్ దీక్షాస్వాముల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వాసవీ కల్యాణ భవనంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి గజం రాజు, పట్టణ కార్యదర్శి చెట్‌పల్లి శంకర్, మంచాల జగన్, బజరంగ్‌దళ్ జిల్లా కోకన్వీనర్ కల్లెడ రోహిత్, గొడికె విజయ్, పల్లికొండ వెంకటేశ్, రాచకొండ చంద్రశేఖర్, కోయాల్కర్ శివ, చింత మధుకర్, అర్విండ్, రామ్, గిరిధర్, చందు, విగ్నేశ్ తదితరులు పాల్గొన్నారు.

నష్టం.. అపారం

జిల్లాలో 5,128 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు



రాయికల్ మండలంలోని ఓ గ్రామంలో నేలవాలిన మొక్కజొన్న



పంట పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారులు

- నేలరాలిన మామిడి
- ధ్వంసమైన నువ్వు పంట
- మొక్కజొన్నకూ తీరని నష్టం
- ప్రాథమిక నివేదికలు రూపొందించిన వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు



మామిడికాయలు పరిశీలిస్తున్న ఉద్యాన అధికారులు



మొక్కజొన్న పంట పరిశీలిస్తున్న భోగ శ్రావణి

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో శనివారం రాత్రి నుంచి ఆదివారం రాత్రి వరకు కురిసిన వడగళ్ల వానతో అన్నదాతలకు అపార నష్టం వాటిల్లింది. బలమైన ఈదురుగాలులతోపాటు వడగళ్లు కురవడంతో పంటలు ధ్వంసమయ్యాయి. మామిడి, నువ్వు, మొక్కజొన్నకు తీవ్రనష్టం వాటిల్లింది. వ్యవసాయ, ఉద్యాన పంటలు కలిపి దాదాపు 5,128 ఎకరాల విస్తీర్ణంలో దెబ్బతిన్నట్లు అధికారులు ప్రాథమిక నివేదకలు రూపొందించారు.

వరి, నువ్వు, మొక్కజొన్నకు నష్టం..

- జిల్లాలో ఈ యాసంగిలో సాగుచేసిన వరి, నువ్వు, మొక్కజొన్న పంటలు ఈదురుగాలుల ధాటికి ఎక్కడికక్కడే విరిగిపోయాయి.
- దాదాపు 374 మంది రైతులకు చెందిన సుమారు 522 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు అధికారులు నివేదికలు రూపొందించి, ప్రభుత్వానికి పంపించారు.
- మేడిపల్లి మండలం పసునూర్, కథలాపూర్ మండలం కలికోట, బుగ్గారం మండలం వెల్గొండ, సిరివంచకోట, గోపులపూర్, కొడిమ్యాల మండలం తిప్పాయిపల్లి, శ్రీరాములపల్లె, జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి, వంజరిపల్లె, వెల్గటూర్ మండలం ముత్తునూర్, స్తంభంపల్లి, పడ్కల్ గ్రామాల్లో వ్యవసాయధికారులు సర్వే చేశారు.
- 33శాతానికి మించిన పంటల నష్టంపైనే ప్రాథమిక అంచనాలు రూపొందించారు.
- వరి దాదాపు 428 ఎకరాలు, మొక్కజొన్న సుమారు 50 ఎకరాలు, నువ్వు పంట ఇంచుమించు 44 ఎకరాల్లో నష్టం జరిగినట్లు ప్రకటించారు.

33శాతం నిబంధన రైతులకు శాపం..

- పంట నష్టం 33శాతానికి పైగా జరిగితేనే అధికారులు నివేదికలు తయారు చేస్తున్నారు. దీంతో, ప్రభుత్వం విధించిన ఈ నిబంధన రైతులకు శాపంగా మారింది. వారం రోజుల్లో కోతకు వచ్చిన పంటలను సైతం అధికారులు లెక్కలోకి తీసుకోవడం లేదు. ఇదలా ఉంటే, రాజకీయ పార్టీల నాయకులు నష్టపోయిన పంటలను పరిశీలిస్తూ, రైతులకు పరిహారం మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు బీజేపీ నాయకురాలు భోగ శ్రావణి జగిత్యాల అర్బన్ మండలం మోతె గ్రామంలో పర్యటించి, నష్టపోయిన మొక్కజొన్న పంట పరిశీలించారు. ఎకరాకు రూ.50వేల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

మామిడికి అపార నష్టం..

- జిల్లాలో మామిడి పంటకు అపార నష్టం జరిగింది. ప్రధానంగా మేడిపల్లి, మల్యాల, కథలాపూర్, కోరుట్ల, కొడిమ్యాల, మల్లాపూర్, జగిత్యాల రూరల్, రాయికల్, సారంగాపూర్, బీర్‌పూర్, ధర్మపురి, బుగ్గారం, పెడగపల్లి, వెల్గటూర్, గొల్లపల్లి, ఎండపల్లి మండలాల్లో తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.

మామిడి కాయలు రాలిపోయి, కొమ్మలు విరిగిపడిపోయాయి. ఈ మేరకు ఉద్యానశాఖ అధికారులు ఆయా మండలాల్లో పర్యటించి, దాదాపు 4,606 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు నివేదికలు రూపొందించారు. నివేదికను ప్రభుత్వానికి పంపించినట్లు జిల్లా ఉద్యానశాఖాధికారి ప్రతాప్‌సింగ్ ఆదివారం చెప్పారు. వరి, మొక్కజొన్న, నువ్వులు, మామిడిపంటకు జరిగిన నష్టం మొత్తంగా దాదాపు 5,128 ఎకరాలు ఉంటుందని అంచనా వేశారు.



మెట్‌పల్లి మండలంలో నేలవాలిన వరిపైరు

శనివారం రాత్రి నమోదైన వర్షపాతం(మి.మీ.లలో)

మండలం	వర్షపాతం	మండలం	వర్షపాతం
జగిత్యాల	32.4	పెగడపల్లి	36.9
రాయికల్	5.4	కొడిమ్యాల	35.2
బుగ్గారం	0.6	వెల్గటూర్	18.2
ధర్మపురి	7.4	కోరుట్ల	6.6
బీర్‌పూర్	3.2	మేడిపల్లి	17.8
సారంగాపూర్	20.4	మెట్‌పల్లి	9.2
మల్యాల	50.6	ఇబ్రహీంపట్నం	5.6
గొల్లపల్లి	30.2	కథలాపూర్	8.0
		మల్లాపూర్	2.2

కర్రలు విరిగాయి



నేను రెండున్నర ఎకరాల్లో మక్క ఏసిన. శనివారం భారీవాన కురిసింది. బలమైన ఈదురుగాలులు వచ్చినయి. మక్క కర్రలు మొత్తం విరిగి నేలమీదపడ్డయి. లక్ష రూపాయల వరకు నష్టం వచ్చింది. సర్కారే ఆదుకోవాలి. – రాజు, రైతు, చల్‌గల్

తీవ్రనష్టం



నేను రెండు ఎకరాల్లో మక్క వేసిన. పంట చేతికి వస్తున్నది. ఈ తరుణంలో శనివారం రాత్రి బలమైన ఈదురుగాలులు వీచినయి. వాటి ధాటికి పంట మొత్తం నేలవాలింది. నష్టం తీవ్రంగా ఉంది. అధికారులు సర్వే చేసి పరిహారం ఇవ్వాలి. – కాటిపెల్లి చిన్నారెడ్డి, రైతు, సింగరావుపేట, రాయికల్

మంత్రి కేటీఆర్‌దే బాధ్యత



జిల్లా కేంద్రంలో సీఎం దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

- పేపర్ లీక్‌పై బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారు
- కాంగ్రెస్ శ్రేణుల ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మ దహనం

జగిత్యాల: టీఎస్ పీఎస్సీ ప్రశ్నపత్రం లీక్‌తో యువకులు, నిరుద్యోగుల్లో తీవ్రనిరాశ నిస్పృహలు నెలకొన్నాయని కాంగ్రెస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు పూర్తిబాధ్యత మంత్రి కేటీఆర్‌దేనని, వెంటనే ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. టీపీసీసీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు ఆదివారం నిరసన ప్రదర్శన చేపట్టారు. సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. పలువురు నాయకులు రాష్ట్రప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్థానిక ఇందిరాభవన్ నుంచి తహసీల్ చౌరస్తా వరకు ర్యాలీగా తరలివెళ్లారు. సీఎం రాజీనామా చేయాలని నినాదాలు చేశారు. పలువురు నాయకులు మాట్లాడుతూ, పేపర్ లీక్ వ్యవహారంలో లక్షలాది మంది నిరుద్యోగుల భవిష్యత్ అంధకారమైందన్నారు. మంత్రి కేటీఆర్ సమీప బంధువులు లబ్ధిపొందడానికి పేపర్ లీక్ చేశారని ఆరోపించారు. బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు గిరి నాగభూషణం, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మీ, నాయకులు బండ శంకర్, తాటిపర్తి దేవేందర్‌రెడ్డి, కొంద్ర జగన్, పుప్పాల జగన్, నక్క జీవన్, కోర్తు శ్రీను, గాజుల రమేశ్‌రావు, వీరబత్తిని శ్రీనివాస్, ధర రమేశ్‌బాబు, మన్సూర్, గుండా మధు, తిప్పన్నపేట విజయ్, నేహాల్ శేఖర్, తోపారపు రజనీకాంత్ పాల్గొన్నారు.



మల్లాపూర్‌లో పూజలు చేస్తున్న పూజారులు, భక్తులు



ఒగ్గుకథ కళాకారుల ప్రదర్శన

మల్లన్నకు బోనం మొక్కులు

కథలాపూర్/మల్లాపూర్: కథలాపూర్ మండలం ఊట్‌పల్లితోపాటు మల్లాపూర్ మండలకేంద్రంలో ఆదివారం మల్లికార్జునస్వామి జాతర వైభవంగా జరిగింది. ఆయా గ్రామాల్లో మహిళలు పురవీధుల్లో బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. ఆలయానికి చేరుకుని స్వామివారికి నైవేద్యం సమర్పించారు. తమ కుటుంబాలను సల్లంగా చూడాలని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేశాయి. పలువురు ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.



ఊట్‌పల్లిలో భక్తుల బోనాల ఊరేగింపు

క్లుప్తంగా

బీజేపీ నాయకుడి అరెస్టు

జగిత్యాలక్రైం : జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట శనివారం బీజేపీ ఆధ్వర్యంలో టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీని నిరసిస్తూ ధర్నా చేపట్టారు. ధర్నాలో బీజేపీ నియోజకవర్గం నాయకుడు పన్నాల తిరుపతి రెడ్డి పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతో పాటు పోలీస్ వాహనంపై ఎక్కి దురుసుగా ప్రవర్తించడంతో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసున మోదు చేశారు. తిరుపతి రెడ్డిని ఆదివారం పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

'తిరుపతిపై ఆరోపణలు అవాస్తవం'

మల్యాల: మండలంలోని పోతారం గ్రామానికి చెందిన బండారి తిరుపతి తెలంగాణ ఉద్యమం నుంచి కేటీఆర్ వెన్నంటి ఉంటూ, కార్యకర్తలకు అండగా నిలుస్తున్నారని, తిరుపతిపై ఆరోపణలు అవాస్తవమని జెడ్పీటీసీ కొండపల్కల రాంమోహన్‌రావు అన్నారు. మండలంలో వైస్ ఎంపీపీ పోతాని రవి, ఎడిపెల్లి అశోక్, అయిల్నేని సాగర్‌రావు, గడ్డం మల్లారెడ్డి, జున్ను సురేశ్, వలీ, కోటేశ్వర్‌రావుతో కలిసి జెడ్పీటీసీ రాంమోహన్‌రావు మాట్లాడారు. టీఎస్ పీఎస్సీ పేపర్ల లీకేజీలో తిరుపతిని ఇరికించేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో గ్రామాభివృద్ధికి సహకారం అందిస్తున్న తిరుపతిపై ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.

ఒప్పంద ఉద్యోగ నియామకాలు

జగిత్యాల: మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల శాఖలో ఒప్పంద ప్రాతిపదికన ఉద్యోగ నియామకాలు చేపడుతున్నట్లు కలెక్టర్ యాస్మిన్‌బాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఒరిజనల్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను ఈనెల 28 పరిశీలిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా సంక్షేమాధికారి కార్యాలయం, సమీకృత జిల్లా కార్యాలయాల్లో సంప్రదించాన్నారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

ధర్మపురి : ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణంలోని హెచ్‌పీ పెట్రోల్ పంపు వద్ద శనివారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు అతివేగంతో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో తపత్ మహేందర్, కాస నర్సయ్యకు తీవ్రగాయాలయ్యాయి. 108 సిబ్బందికి సమాచారం అందించగా చికిత్స నిమిత్తం జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గీత కార్మికుడికి..


గాయపడిన శంకరయ్య

సారంగాపూర్: మండలంలోని రేచపల్లిలో తాటి చెట్టుపై నుంచి పడి రంగు శంకరయ్య అనే గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శంకరయ్య రోజూ మాదిరిగానే కల్లు గీసేందుకు ఆదివారం తాటి చెట్టుపైకి ఎక్కుతున్న క్రమంలో మోక జారి కిందపడిపోయాడు. దీనితో శంకరయ్యకు తీవ్ర గాయాలుకాగా జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వన్యప్రాణుల దాహం తీర్చేలా..


సాసర్‌పిట్స్‌లో నీరు నింపుతున్న అటవీశాఖ అధికారులు


అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సోలార్‌బోర్లు

- జిల్లావ్యాప్తంగా 240 సాసర్ పిట్స్ ఏర్పాటు
- రెండు సోలార్ బోర్ల నిర్మాణం
- వణ్యప్రాణులు సంచరించే ప్రాంతాల్లో ప్రత్యేక నీటి వసతి

జగిత్యాల క్రైం : అడవుల్లోని వన్యప్రాణులు వేసవిలో బయటకు వస్తుండటంతో కుక్కలు, వేటగాళ్లతో ప్రమాదవశాత్తు బావుల్లో పడి మృత్యువాత పడుతున్నాయి. దీంతో జిల్లాలో అటవీశాఖ అధికారులు వన్యప్రాణుల దాహర్తి తీర్చేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి వాటికి నిత్యం నీటిని అందుబాటులో ఉంచి దాహం తీరుస్తున్నారు. జిల్లాలో ఐదు రేంజ్‌ల పరిధిలో 53వేల హెక్టార్లలో అటవీ విస్తరించి ఉంది. దీంతో అడవుల్లో ఉన్న వన్యప్రాణులు వేసవిలో నీటికోసం బయటకు వచ్చి ప్రమాదాల బారినపడకుండా పటిష్ట చర్యలు చేపట్టారు.

240 సాసర్‌పిట్స్ నిర్మాణం

జిల్లావ్యాప్తంగా గతంలో ఉన్న వాటితో పాటు అడవుల్లో నీటి నిల్వలు ఉంచేందుకు మొత్తం 240 సాసర్‌పిట్స్ నిర్మాణాలను ఏర్పాటు చేశారు. దీంతో ట్యాంకర్లతో అక్కడున్న నీటివసతి ద్వారా సాసర్‌పిట్స్‌లో నీటి నిల్వలు ఉంచి వన్యప్రాణుల దాహర్తిని తీర్చుతున్నారు.

చెక్‌డ్యాంల ద్వారా నీటి నిల్వలు..

జిల్లాలోని అడవుల్లో భూగర్భజలాలు పెంచేందుకు ఇప్పటికే 45 చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టారు. దీంతో పాటు 113 నీటికుంటలు ఉన్నాయి. ఇందులో వర్షపునీరు వృథాకాకుండా అడ్డుకట్ట వేసి చెక్‌డ్యాంలు, నీటి కుంటల్లో నీటి నిల్వలు ఉంచారు. వన్యప్రాణులు నీరు తాగడంతో పాటు అడవుల్లో చెట్లు విస్తారంగా పెరిగేందుకు నీటి నిలవ్లు ఎంతో దోహదపడుతున్నాయి.

వన్యప్రాణుల దాహం తీర్చేందుకే..

జిల్లావ్యాప్తంగా అడవుల్లో రెండు సోలార్‌బోర్లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వీటి పనితీరు ఆధారంగా మరికొన్ని బోర్లు ఏర్పాటు చేసేందుకు పరిశీలిస్తున్నారు. సోలార్ ద్వారా విద్యుత్ సరఫరా కావడంతో బోర్ల ద్వారా నీటిని తీసి వన్యప్రాణుల దాహం తీర్చేందుకు అడవుల్లో ఏర్పాట్లు చేశారు.

జిల్లాలో అడవుల

విస్తీర్ణం	:53 వేల హెక్టార్లు
సాసర్‌పిట్స్	:240
చెక్‌డ్యాంలు	:45
నీటికుంటలు	:113
సోలార్ బోర్లు	:2

వేసవి దృష్ట్యా నీటి వసతి..



జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో ఉన్న వన్యప్రాణులకు వేసవిదృష్ట్యా నీటి వసతులు కల్పించాం. వన్యప్రాణులు ఆరుబయటకు రావడంతో ప్రమాదాల బారినపడుతున్నా యి. ఈ నేపథ్యంలోనే వన్యప్రాణులు సంచరించే ప్రాంతాల్లో ప్రత్యేకంగా నీటి వసతులు కల్పించి వాటి దాహర్తి తీర్చేలా చర్యలు చేపట్టాం. –వెంకటేశ్వర్‌రావు, జిల్లా అటవీశాఖ అధికారి

ఆత్మీయ సమ్మేళనాలను విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

కోరుట్ల: నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో నిర్వహించనున్న ఆత్మీయ సమ్మేళనాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు కోరారు. ఆదివారం ఆయన కోరుట్ల ఎమ్మెల్యే క్యాంప్ క్వార్టర్లలో మాట్లాడారు. ఈనెల 23న మల్లాపూర్ మండలంలో కేఎంఆర్ గార్డెన్స్‌లో, 27న ఇబ్రహీంపట్నం మండల ఆత్మీయ సమ్మేళనం వేంకటేశ్వర ఆలయంలో, 29న మెట్‌పల్లి మండల సమ్మేళనం వీఆర్‌ఎం గార్డెన్స్‌లో, ఏప్రిల్ 3న మెట్‌పల్లి పట్టణ ఆత్మీయ సమ్మేళనం వెంకట్ రెడ్డి గార్డెన్స్‌లో, 5న కోరుట్ల పట్టణ ఆత్మీయ సమ్మేళనం పీబీ గార్డెన్స్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమ్మేళనాలకు ఆయా మండలాల ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు. సమావేశంలో కోరుట్ల పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అన్నం అనిల్, ఎంపీపీ తోట నారాయణ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేశం, మెట్‌పల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ బోయినపల్లి చంద్రశేఖర్‌రావు, ఎంపీపీ జాజల భీమేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేత..

కోరుట్ల: రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న ఐకేపీ సెర్ప్ ఉద్యోగులకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత, పేస్కేల్ వర్తింపజేసినందుకు గాను ధన్యవాదాలు తెలుపుతూ ఆదివారం ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావును సెర్ప్ ఉద్యోగులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట నారాయణ, జిల్లా రైతుబంధు అధ్యక్షుడు చీటి వెంకట్రావ్, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేశం పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐ పాలసీ అమలు చేయాలి

- బీజేపీ యూఏఈ కో–కన్వీనర్ పెనుకుల అశోక్


ఎమ్మెల్యే రఘునందన్‌రావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న అశోక్

మల్లాపూర్ : గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఎన్ఆర్ఐ పాలసీ అమలు చేయాలని బీజేపీ యూఏఈ కో–కన్వీనర్ పెనుకుల అశోక్ కోరారు. ఆదివారం దుబాయిలో బీజేపీ యూఏఈ శాఖ ఆధ్వర్యంలో దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావును కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లోని యువత ఉపాధి కోసం ఏడారి దేశాలకు వలస వెళ్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అమాయక కార్మికులు నకిలీ ఏజెంట్ల చేతుల్లో మోసపోతున్నారని, గల్ఫ్ దేశాలకు వలస వచ్చి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇలాంటి గల్ఫ్ బాధితులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలవాలని పేర్కొన్నారు. వలసజీవుల వెతలు తీరాలంటే కేంద్ర ప్రభుత్వం ఎన్ఆర్ఐ పాలసీని ప్రకటించాలన్నారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే గల్ఫ్ కార్మికుల విన్నపాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, ఎన్ఆర్ఐ పాలసీపై ప్రభుత్వం ప్రకటన చేయాలని అసెంబ్లీలో లేవనెత్తుతాని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో యూఏఈ బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నపత్రాల లీకేజీలకు పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలి

- చొప్పదండి వైఎస్సార్‌టీపీ ఇన్‌చార్జి తడగొండ సత్యరాజ్ వర్మ


షర్మిలతో చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి సత్యరాజ్ వర్మ

మల్యాల : టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీలకు పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలని చొప్పదండి వైఎస్సార్‌టీపీ ఇన్‌చార్జి తడగొండ సత్యరాజ్ వర్మ అన్నారు. సిరిసిల్లలో ఇటీవల నవీన్ అనే యువకుడు ఆత్మహత్య చేసుకోగా బాధిత కుటుంబాన్ని ఆదివారం వైఎస్సార్‌టీపీ అధినేత్రి షర్మిలతో కలిసి పరామర్శించారు. ప్రశ్నపత్రాల లీకేజీలతో లక్షలాదిమంది నిరుద్యోగుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ప్రత్యేక రాష్ట్రంలో ఉద్యోగాలు దొరకక నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడడం బాధాకరమన్నారు. నిరుద్యోగుల ఉసురు సీఎం కేసీఆర్‌కు తగులుతుందన్నారు.

కవితపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం

- జాగృతి యువత జిల్లా అధ్యక్షుడు గనవేని మల్లేశ్


పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న గనవేని మల్లేశ్

మల్లాపూర్ : ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించమని జాగృతి యువత జిల్లా అధ్యక్షుడు గనవేని మల్లేశ్ అన్నారు. ఎమ్మెల్సీ కవితపై తీన్మార్ మల్లన్న చేస్తున్న వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్సై నవీన్‌కుమార్‌కు ఆయన ఫిర్యాదు చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రోద్బలంతోనే ఎమ్మెల్సీ కవితపై ఈడీ లిక్కర్ స్కాం కేసులో ఇరికించిందని దుయ్యబట్టారు. బీజేపీ ప్రేరేపిత లిక్కర్ స్కాంను ఆసరా చేసుకుని ఎమ్మెల్సీ కవితపై తీన్మార్ మల్లన్న చేస్తున్న వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భారత జాగృతి యువత మండల అధ్యక్షుడు పొట్టుపల్లి చిన్నయ్య, నాయకులు వేములవాడ దేవరాజం, సిరికొండ మహిపాల్, వన్నెల అశోక్, సరికెల సందీప్, చిన్నయ్య, రక్షిత్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఆర్థిక భరోసా

- మహిళా సంఘాలకు పావలా వడ్డీ రుణాలు విడుదల
- జిల్లాకు రూ.22కోట్ల 66 లక్షల 96 వేలు
- నేరుగా మహిళా సంఘాల ఖాతాల్లో జమ
- హర్షం వ్యక్తంచేస్తున్న సభ్యులు


మహిళా సంఘాల సభ్యులు

పెగడపల్లి : మహిళా సంఘాల సభ్యులకు పెండింగ్‌లో ఉన్న పావలా వడ్డీ రాయితీ సొమ్మును ఎట్టకేలకు ప్రభుత్వం విడుదల చేసింది. జిల్లావ్యాప్తంగా 2108–19, 2019–20 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రూ. 22కోట్ల 66 లక్షల 96వేలు విడుదల చేసి మహిళా సంఘాల ఖాతాల్లో జమచేసింది. దీంతో జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. జిల్లాలోని 20 మండలాల్లోని 2018–19లో 12195 సంఘాలకు రూ. 6,20, 69951, 2019–20కి గానూ 12463 సంఘాలకు రూ.16,46, 2619లను ప్రభుత్వం విడుదల చేసింది. మహిళా సంఘాల సభ్యులు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని స్వయం ఉపాధి యూనిట్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. కొందరు హోటళ్లు, బేకరీలు, టైలరింగ్, క్లాత్‌స్టోర్ వంటి దుకాణాలను ఏర్పాటు చేసుకొని స్వయం ఉపాధివైపు అడుగులు వేస్తున్నారు. వీరు తీసుకున్న రుణాలను నెలనెలా పొదుపుతో పాటు వడ్డీని వాయిదా పద్ధతిలో కిస్తీల రూపంలో బ్యాంకులకు చెల్లిస్తున్నారు. బ్యాంకులు నిర్దేశించిన సమయంలోగా వడ్డీ చెల్లించిన సంఘాలకు ప్రభుత్వం ప్రకటించిన వడ్డీ రాయితీ పథకానికి అర్హులవుతారు.

రెండేళ్ల బకాయిలు విడుదల..

జిల్లా వ్యాప్తంగా మహిళా సంఘాలకు నాలుగేళ్ల నుంచి పావలా వడ్డీ రాయితీ రావాల్సి ఉంది. అయితే అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజు రెండేళ్లకు చెందిన వడ్డీని ప్రభుత్వం విడుదల చేసింది. ఇందులో భాగంగా ఈ సొమ్మును విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు.

సంతోషంగా ఉంది



రెండు సంవత్సరాలకు సంబంధించిన వడ్డీ సొమ్ము విడుదల చేయడం సంతోషంగా ఉంది. మహిళా సంఘాలు తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా పొదుపుతో పాటు వడ్డీ చెల్లిస్తున్నారు. వడ్డీసొమ్ము కోసం మహిళా సంఘాలు ఎదురుచూస్తున్న క్రమంలో ప్రభుత్వం వడ్డీ రాయితీ సొమ్మును విడుదల చేయడం అభినందనీయం. –సుధారాణి, వీవో పెగడపల్లి

ఆర్థికంగా మేలు..



ప్రభుత్వం పావలా వడ్డీ డబ్బులను విడుదల చేసి మహిళా సంఘాల సభ్యులకు ఆర్థికంగా మేలుచేసింది. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులున్నా మహిళాసంఘాలు తీసుకున్న రుణాలు చెల్లించి బ్యాంకుల అభివృద్ధికి సహకరిస్తూ వస్తున్నారు. ఇంకా రెండేళ్ల సొమ్ము ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. పూర్తి బకాయిలు చెల్లించి మహిళలకు ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలవాలి. – భాగ్య, మండల సమాఖ్య అధ్యక్షురాలు

నేరుగా ఖాతాల్లోకి..



పావలా వడ్డీ డబ్బులను నేరుగా మహిళా సంఘాల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. జిల్లాలోని మహిళా సంఘాలకు 2018–2019, 2019–20 రెండేళ్లకు చెందిన రూ. 22 కోట్ల 66 లక్షల 96 వేలు వడ్డీ రాయితీని ప్రభుత్వం విడుదల చేసింది. ప్రభుత్వం మహిళలకు అందించే రాయితీ పథకాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలి. –లక్ష్మీనారాయణ, డీఆర్డీవో


ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న రంజిత్‌కుమార్

గంభీరావుపేట: ఎల్లారెడ్డిపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కో కన్వీనర్ మారవేని రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలకేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి కేటీఆర్ స్పందించకపోతే భవిష్యత్‌లో విద్యార్థుల నుంచి వ్యతిరేకత ఎదుర్కోవడం ఖాయమన్నారు. మారుమూల ప్రాంత విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని కళాశాల ఏర్పాటుకు కృషిచేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కన్వీనర్ నాగరాజు, ఆదిత్య అరవింద్, రాకేష్, సిద్ధు, నిఖిల్, శివ రాజేందర్, అజయ్, నరేశ్, అరుణ్, భరత్, వంశీ, ప్రవీణ్, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

సిరిసిల్ల అర్బన్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీఐటీయూ రైతుసంఘం వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడ రమణ ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని కార్మికులు, కర్షకులు అన్ని రంగాల కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఇక్కడ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి, రైతు సంఘం నాయకులు రామంచ అశోక్, గన్నేరం నర్సయ్య, బాబు, సూరం పద్మ, మోర అజయ్, తదితరులున్నారు.

టేకు కలప పట్టివేత

మేడిపెల్లి: బీమారం మండలం.. మన్నెగూడెం గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన టేకు కలపను అటవీశాఖ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. రూ.5 లక్షల విలువగల టేకు కలపను పట్టుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ ఎఫ్ఆర్వో రవికుమార్, బీట్ ఆఫీసర్ ప్రదీప్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఒంటిపూట బడులు


పెగడపల్లిలో అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న చిన్నారులు

పెగడపల్లి: వేసవిని దృష్ట్యా అంగన్‌వాడీ కేంద్రాలకు నేటి నుంచి ఒంటిపూట బడులు నిర్వహించాలని మహిళా, శిశు సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీచేసింది. నేటినుంచి జూన్1 వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగనున్నాయి. జిల్లావ్యాప్తంగా 1065 అంగన్‌వాడీ కేంద్రాలుండగా 5 ఏళ్లలోపు చిన్నారులు 62446 మంది ఉన్నారు.

ప్రభుత్వ భూమిని పేదలకు కేటాయించండి

జ్యోతినగర్(రామగుండం): రామగుండం కార్పొరేషన్ పరిధిలో ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని, నిరుపేదల ఇళ్ల కోసం కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై. యాకయ్య డిమాండ్ చేశారు. ఆదివారం రెండో డివిజన్ ఇందిరమ్మ కాలనీలోని ప్రభుత్వ భూమిలో జెండాలను పాతారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఇళ్లు నిరుపేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయిస్తామని చెప్పి, పదేళ్లవుతున్నా ఇవ్వలేదన్నారు. కబ్జాదారుల నుంచి భూమిని రక్షించేందుకు రెవె న్యూ, పోలీసు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. సీపీఎం ఎన్టీపీసీ రామగుండం ఏ రియా కమిటీ కార్యదర్శి ఎం.రామాచారి, జిల్లా క మిటీ సభ్యుడు నాంసాని తదిదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి


శ్రీధర్‌ను సన్మానిస్తున్న మండల అధ్యక్షుడు సత్యనారాయణ

మల్లాపూర్ : అకాలవర్షానికి పంటనష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని బీజేపీ పార్లమెంట్ విస్తారక్ శ్రీధర్ డిమాండ్ చేశారు. ఆదివారం బీజేపీ మండలశాఖ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్ని ఫాంహౌస్‌కు పరిమితం చేసే సమయం ఆసన్నమైందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై బీజేపీ క్షేత్రస్థాయిలో ప్రజల పక్షాన పోరాటం చేస్తుందన్నారు. 2023లో బీజేపీకే పట్టం కట్టనున్నారని తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాంబారి ప్రభాకర్, బీజేపీ రాష్ట్ర నాయకుడు సురభి నవీన్‌కుమార్, మండల అధ్యక్షుడు ముద్దం సత్యనారాయణగౌడ్, జిల్లా కార్యదర్శి ఎర్ర లక్ష్మి, బీజేవైఎం మండల అధ్యక్షుడు పందిరి నాగరాజు, ఐటీ సెల్ అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ బండారి వెంకటేశ్, బీజేపీ దళితమోర్చా అధ్యక్షుడు నంగి సాయన్న, కిసాన్‌మోర్చా జిల్లా కార్యవర్గసభ్యులు గడ్డం నవీన్‌రెడ్డి, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు శ్రీశైల మల్లేశ్ యాదవ్, మహిళామోర్చా నాయకురాలు అంజమ్మ, నాయకులు మహేశ్, మోకు రాజేందర్, దామ రాజేశ్, రాజరెడ్డి పాల్గొన్నారు.

భూ వివాదమే ప్రాణాలు తీసింది


రోదిస్తున్న మృతుడి భార్య

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన ఓ రైతు తన పేరిట భూమి రిజిస్ట్రేషన్ చేసే విషయంలో తల్లిదండ్రులు అంగీకరించడం లేదని మనస్తాపంతో పురుగులమందు తాగగా.. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఈ సంఘటన స్థానికంగా విషాదం నింపింది. తల్లిదండ్రులే భూమి ఇవ్వడంలో వివాదంగా వ్యవహరించడంతో తన భర్త మనోవేదనకు గురై క్రిమిసంహారక మందు తాగాడని మృతుని భార్య మానస ఆరోపించింది. ఎల్లారెడ్డిపేటకు కేంద్రానికి చెందిన బింగి సురేశ్(35) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈక్రమంలో రెండు ఎకరాల భూమిని తన పేరిట చేయాలని కోరాడు. తల్లిదండ్రులు నిరాకరించడంతో ఆవేదనకు లోనైన సురేశ్ కిష్టంపల్లి శివారులో గత శుక్రవారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. సురేశ్ తండ్రి లచ్చయ్యకు ముగ్గురు కొడుకులు కాగా.. రెండో కుమారుడు అనారోగ్యంతో మృతిచెందాడు. తన భర్త మృతితో తాము రోడ్డున పడ్డామని భార్య మానస విలపించింది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.